నవలిక

# నీలి మేఘం

నందం రామారావు

## 2

పదేళ్ళ క్రితం...

ఒకనాటి మధ్యాహ్నం వేళ...

తను ఈ మేడ ముందు భయం భయంగా నిలబడ్డాడు. పైన ఎండ మాడుస్తోంది. దాహం, ఆకలి శరీరాన్ని నీరస పరుస్తున్నాయి. ఐనా అవసరం, ఆశ వాటిని జయిస్తున్నాయి.

శశాంక ఆఫీసులో చిరాకుపడ్డాడు. ఉద్యోగాల్లేవని నిర్మొహమాటంగా చెప్పాడు. అది ఆఫీసు కాబట్టి శశాంక అలా ప్రవర్తించి వుంటాడు. ఇంటి దగ్గర మామూలుగా వుంటాడని పిచ్చి నమ్మకంతో, ఆశతో ఆ మేడవేపు చూస్తూ నిలబడ్డాడు.

అయిదు నిమిషాలు గడిచాయి. గూర్ఖా ఎక్కడ నుంచి వచ్చాడో గేటుకి అడ్డుగా నిలబడ్డాడు.

"జావ్. జావ్" అంటూ బిచ్చగాడిని తరిమినట్టు తరిమికొట్టాడు.

కిరీటి అన్నీ సహించాడు. ఎలాగో ధైర్యం చేసుకుని, తనకొచ్చిన హిందీలో శశాంకకి తనకుగల స్నేహాన్నిగూర్చి చెప్పడానికి ప్రయత్నించాడు. అతడే కళ నున్నాడో లోపలికి వెళ్ళడానికి అనుమతి ఇచ్చాడు.

తనకెంతో ఆనందం కలిగింది. తడబడే అడుగులతో లోపలకు వెళ్ళాడు. వెళ్ళి వరండా మెట్లముందు నిలబడ్డాడు. తలుపులకి, కిటికీలకు సిల్కు కర్టెన్లు వ్రేలాడుతున్నాయి. హాల్లోనుంచి మాటలు వినిపిస్తున్నాయి.

మెట్లెక్కి లోపలకు వెళ్ళడానికి ధైర్యం చాలలేదు. ఇంతలో లోపలనుంచి ఒక చిన్నపాప వరండాలోకొచ్చింది. తను ఆ పాపను పట్టుకుని "శశాంక వున్నాడా?" అని అడగాలనుకున్నాడు. ఆ పాప చేతిని పట్టుకుని— "శశాంక..." అని ఇంకా ఏదో చెప్పబోతుండగా, ఆ పాప కెవ్వున కేకపెట్టింది.

అంతే! లోపల్నుంచి ఆ పాప తల్లి అనుకుంటా బయటకొచ్చింది.

ఆ పాప- "అమ్మా" అంటూ కరుచుకుపోయింది. ఆమె తనవేపు అసహ్యంగా చూస్తూ—

"యూ రోగ్. ఎలా వచ్చావ్? పిల్లనెత్తుకుపోదామనుకున్నావా?" అని అరిచింది.

తను సిగ్గుతో కుంచించుకుపోతూ—

"కాదండీ, నేను శశాంక స్నేహితుడిని. నా పేరు కిరీటి" అన్నాడు.

ఆవిడ ఇంకా అసహ్యించుకుంటూ—

"ఆయనకు ఇటువంటి గొప్ప స్నేహితులున్నారని నాకు తెలీదే" అంది.

ఇంతలో లోపలి నుంచి—

"ఎవరు మాలా?" అన్న కేక వినిపించింది.

అది శశాంక గొంతు!

"మీ గొప్ప స్నేహితుడు కిరీటట" అంది.

"వాడా? స్కౌండ్రల్. ఇక్కడికూడా వచ్చాడా! పొమ్మను"

ఆమె తనవేపు తిరిగి- "విన్నారా స్నేహితుడుగారూ! ఇక దయచెయ్యండి" అని ఆ పాప చెయ్యిపుచ్చుకుని లోపలకు వెడుతూ—

"ఇటువంటి డర్టీరోగ్స్‌ని లోపలకు రానివ్వద్దని ఆ గూర్ఖా కి వార్నింగ్ ఇవ్వాలి" అంటూ గొణిగింది.

ఆ మాటలు వింటూ తను ఎంత కుమిలిపోయాడో ఆ దేవుడికే తెలియాలి.

"అదేమిట్రా కిరీటీ? అక్కడే నిలబడిపోయావ్?" శశాంక చెయ్యి భుజం మీద పడటంతో ఈ లోకంలోకి వచ్చాడు కిరీటి.

"కిరీటీ! రా లోపలికి వెడదాం" ఆప్యాయంగా ఆహ్వానించాడు శశాంక.

అతని ముఖంలోకి చూసి చిరునవ్వు నవ్వాడు కిరీటి.

"కిరీటీ! నా రూమ్‌లో కూర్చుందాం. ఈ మధ్య ఆ గదిని ఎ.సి. చేయించాను. ఈ హైద్రాబాద్ ఎండలకు నువ్వు తట్టుకోలేవు. ఆ గదిలో ఐతే నీకు బాగా వుంటుంది.

శశాంక అన్న మాటలకు కిరీటికి బిగ్గరగా నవ్వాలనిపించింది. కానీ, బలవంతాన ఆపుకున్నాడు. ఇంకా ముందు ముందు ఎన్ని విషయాలకు నవ్వు కోవాలో! అనుకుంటూ శశాంక అనుసరించాడు.

గదిలోకి వెళ్ళాక, కిరీటికి సోఫా చూపిస్తూ-

"కూర్చో కిరీటి" అన్నాడు.

కిరీటి కూర్చున్నాడు.

చల్లటి గది. మెత్తటి సోఫా. కిరీటికి ఎంతో హాయిగా వుంది.

శశాంక అతనికెదురుగా కూర్చుని-

"ఇప్పుడు చెప్పరా నీ విశేషాలు" అన్నాడు.

"ఏమిటి?"

"బిజినెస్ విశేషాలు?"

కిరీటి సోఫాలో వెనక్కివాలాడు.

"ఏం వుంది. స్పేర్ పార్ట్స్ విదేశాల నుంచి తెప్పించి, వెహికిల్స్ తయారు చేసి ఎక్స్‌పోర్ట్ చేస్తాం"

"ఎన్నాళ్ళయింది నువ్వీ బిజినెస్ మొదలు పెట్టి?"

"పదేళ్ళవుతుంది"

"ఇంకా పార్ట్‌నర్స్ వున్నారా?"

"ఆ. ఇద్దరున్నారు"

"కిరీటీ! నేను చాలాసార్లు బొంబే వొచ్చాను. నువ్వెక్కడున్నావో తెలిస్తే నీ దగ్గరకి వచ్చే వాడిని" అన్నాడు శశాంక.

"ఈ సారి వద్దువుగాని" అన్నాడు కిరీటీ.

"శశాంక లేచి- "ఇప్పుడే వస్తాను" అంటూ క్రిందికి వెళ్ళి అయిదు నిముషాల్లో తిరిగి వచ్చి-

"కిరీటీ! భోజనం చేద్దాం రా" అన్నాడు.

కిరీటి లేచి, అతని వెంట క్రిందికి వెళ్ళాడు. శశాంక కిరీటిని వాష్ బేసిన్ దగ్గరకు తీసుకెళ్ళాడు. కిరీటి చేతులు కడుక్కున్నాక టవల్ అందించాడు. ఇద్దరూ డైనింగ్ టేబుల్ ముందు కూర్చున్నారు.

టేబుల్ మీద వెండి ప్లేట్లు, గ్లాసులు అందంగా అమర్చి వున్నాయి. ప్లేట్లలో రకరకాల పదార్థాలు నోరూరిస్తున్నాయి.

'మాలా" అంటూ భార్యని పిలిచాడు శశాంక.

"వస్తున్నానండీ" అంటూ లోపల నుంచి శశాంక భార్య మాలతి వచ్చింది.

కిరీటి ఆమె వేపు చూశాడు. మాలతి అప్పటి లానే వుంది. ఆమెలో ఏ మార్పు కనిపించలేదు.

"మాలా! ఇతనెవరో తెలుసా! నా బెస్ట్ ఫ్రెండ్ కిరీటి. పెద్ద బిజినెస్ మేగ్నెట్" అంటూ పరిచయం చేశాడు.

మాలతి చేతులు జోడించింది.

''కిరీటీ! ఈమె నా వైఫ్ మాలతి''

కిరీటి కూడా నమస్కారం చేశాడు.

''మాలా! రేఖ ఏదీ?''

''పిలుస్తానుండండి'' లోపలకి వెళ్ళింది.

''రేఖ నా చెల్లెలు. మెడిసిన్ చదువుతోంది'' శశాంక చెబుతున్నాడు.

రేఖ వచ్చింది. రేఖ-సన్నగా, తెల్లగా, సన్నగా జాజి మొగ్గలా వుంది.

నీలం రంగు వాయిల్ చీర కట్టుకుని, అదే రంగు బ్లౌజు వేసుకుంది. విశాలమైన కళ్ళు, చిన్ననోరు.

రేఖని చూడగానే కిరీటికి చల్లని నీడలో నిలబడినట్లనిపించింది.

''రేఖా! ఇతను కిరీటి. నా బెస్ట్ ఫ్రెండ్. ప్రస్తుతం బొంబేలో బిజినెస్ చేస్తున్నాడు.''

''గుడ్ మార్నింగ్ అంకుల్'' అంది రేఖ.

కిరీటి చిన్నగా నవ్వుతూ- ''గుడ్ మార్నింగ్'' అన్నాడు.




''రేఖా! భోజనం చేశావా?'' శశాంక అడిగాడు.

''ఆ నేను కాలేజీకి వెడుతున్నానన్నయ్యా. ప్రాక్టికల్స్ వున్నాయి''

''అలాగే''

''వస్తానంకుల్. మీరు వుంటారుగా సాయంత్రం కలుద్దాం'' అని వెళ్ళిపోయింది.

ఆ అమ్మాయి మాట తీరుకి ముగ్ధుడయ్యాడు కిరీటి!

''ఇక మనం భోజనం కానిద్దాం. మాలా కమాన్''

''మీరు భోజనం చెయ్యండి. నేను వడ్డిస్తాను. లేకపోతే మీ ఫ్రెండ్ మొహమాట పడతారు'' అంది మాలతి.

శశాంక బిగ్గరగా నవ్వి-

''యూ ఆర్ రైట్ మాలా'' అని, కిరిటి వైపు తిరిగి-

## నీలి మేఘం

"కిరీటీ! మొదలు పెట్టు" అన్నాడు.

మాలతి నెయ్యి వడ్డించింది.

వాళ్ళ సంభాషణ వింటూ కిరీటి ఆశ్చర్యంతో తల మున్కలవుతున్నాడు.

ఈమె తనని గుర్తు పట్టలేదా? లేక నటిస్తోందా? శశాంక కూడా 'కిరీటి నా బెస్ట్ ఫ్రెండ్' అంటూ ఎంత తేలిగ్గా చెప్పేశాడు.

ఆనాడు తనని పురుగులా తీసిపారేశాడు. ఇప్పుడు తను కోటీశ్వరుడని తెలియగానే ఎంతో మర్యాద ఇస్తున్నాడు.

అంతా డబ్బు మహత్మ్యం!

మనిషికీ మనిషికీ సంబంధం డబ్బువల్లనే!

ఇతర బాంధవ్యాలూ, స్నేహాలూ ఏమీ లేవు!

అసలు, శశాంక తనని చూడగానే సిగ్గుపడతాడని అనుకున్నాడు. ఆ నాటి అతని ప్రవర్తనకు క్షమాపణ అడుగుతాడని కూడా అనుకున్నాడు. కానీ, ఇలా మర్యాద, ఆప్యాయతా నటిస్తూ, ఏమీ జరగనట్టు వ్యవహరిస్తాడని కలలో కూడా అనుకోలేదు.

తలచుకుంటున్న కొద్దీ శశాంక మీద కోపం, అసహ్యం కలగసాగాయి కిరీటికి.

'శశాంకా! డబ్బుకి కక్కుర్తి పడే నీలాటి వాళ్ళకు తగిన గుణ పాఠం చెప్తారా! కసిగా నవ్వుకున్నాడు కిరీటి.

"ఏమిట్రా కిరీటి? ఏం నచ్చడం లేదా! మాలా నువ్వు చేసిన వంటకాలేవీ మా కిరీటికి నచ్చలేదోయ్" శశాంక అన్నాడు.

"ఏవండీ! ఏం నచ్చలేదా!" మాలతి ఆప్యాయంగా అడిగింది.

"అబ్బే! అదేం కాదండి. చాలా బాగున్నాయి" అంటూ గబగబా భోజనం చేయసాగాడు కిరీటి.

"మాలా! కిరీటి సరోవర్‌లో దిగాట్ట. మాశావా! నే నిక్కడికి వచ్చేయమని చెబుతున్నాను"

చెప్పడమేమిటండీ. మన కారు డ్రయివర్ని పంపి ఆ రూమ్ ఖాళీ చేయించి, సామాను తెప్పించండి"

"గుడ్ అయిడియా" శశాంక మెచ్చుకున్నాడు.

'ఆహా! శశాంకా! ఏం ప్రేమరా ఈ కిరీటి మీద నీకు. మనిషి యొక్క మరో రూపాన్ని ఇప్పుడు చూస్తున్నాను.

భోజనలయ్యాక మళ్ళీ ఇద్దరూ పైకి వచ్చి రూమ్‌లో కూర్చున్నారు.

కిరీటి సిగార్ వెలిగించుకుని-

"శశాంకా! ప్రభాకర్ ఇక్కడే వున్నాడా?" అనడిగాడు.

"ఆ"

"వాడింటికి వెళ్ళాలి"

"నువ్వెళ్ళడం ఎందుకురా నీకు అనవసరమైన శ్రమ. ఫోన్ చేస్తే వాడే వొస్తాడు" అంటూ లేచి ఫోన్ దగ్గరకు వెళ్ళాడు.

'నాకు శ్రమా?' అని నవ్వుకున్నాడు కిరీటి.

శశాంక ఫోన్ డయల్ చేశాడు.

క్షణం తర్వాత అవతలి గొంతు పలికింది.

"హల్లో ప్రభా! నీకో సర్‌ప్రైజ్"

"..............."

"ఇక్కడికి రా తెలుస్తుంది" అంటూ ఫోన్ పెట్టేశాడు శశాంక. కిరీటి వైపు తిరిగి "అయిదు నిముషాల్లో వస్తున్నానని చెప్పాడు" అన్నాడు.

కిరీటి సరేనన్నట్టు తలూపాడు.

"కిరీటీ! ప్రభాకర్ కూడా బిజినెస్‌లోకి దిగాడు. వాడి పని ఇప్పుడు చాలా బావుంది.

ఇక్కడ ఒక సినిమా హాలు కూడా కట్టించాడు" శశాంక అన్నాడు.

కిరీటి మౌనంగా వింటున్నాడు.

"కిరీటీ! కాలేజీ రోజుల తర్వాత నువ్వు మళ్ళీ ప్రభాకర్‌ని చూడలేదు కదూ!"!


శశాంక మాటలతో కిరీటి మనస్సు ఒక్కసారి పదేళ్ళు వెనక్కి వెళ్ళింది!

** ** ** **

పదేళ్ళ క్రితం

శశాంక చేత తిరస్కరింపబడ్డాక కిరీటి ప్రభాకర్ దగ్గరకు వెళ్ళాడు. అప్పుడు ప్రభాకర్ ఒక పెద్ద కంపెనీలో మేనేజరుగా వుంటున్నాడు. శశాంక వుద్యోగ మివ్వకపోయినా అతనికి పెద్ద బాధ కలగలేదు.

తనకి ప్రభాకర్ వున్నాడు. వాడు తనని తప్పకుండా ఆదుకుంటాడు. కాలేజీలో చదువుకునే రోజుల్లో ప్రభాకర్ కిరీటికి మరో శిష్యుడు.



ఎప్పుడూ కిరీటి వెంటే తిరుగుతూ వుండేవాడు. ఆ రోజుల్లో-కిరీటి చదువులో, గేమ్స్‌లో ఫస్ట్‌గా వుండేవాడు.

సన్నగా, బలహీనంగా వుండే ప్రభాకర్, కిరీటి కండలు తిరిగిన శరీరాన్ని చూసి అసూయ పడేవాడు.

''కిరీటీ! నీలా వుండాలంటే ఏం చెయ్యాలిరా'' అని కిరీటిని అడిగేవాడు ప్రభాకర్.

కిరీటి అతన్ని ప్రతి ఉదయం రన్నింగ్‌కి తీసుకెళ్ళేవాడు. అతని చేత గేమ్స్ ఆడించేవాడు. కానీ ప్రభాకర్ ఐదు నిముషాల్లోనే అలిసి పోయేవాడు. అతని అవస్థ చూసి కిరీటి నవ్వుకునేవాడు.

''ఒరేయ్! త్వరగా లావెక్కే వుపాయాలు చెప్పరా!'' అంటూ కిరీటి ప్రాణాలు తీసేవాడు.

అంతేకాదు-

''కిరీటీ! ఈ పాఠం చెప్పవా? లెక్చరర్ కంటే నువ్వు చాలా బాగా చెప్తావ్. నువ్వు చెప్తే ఎంత కష్టమైన పాఠం అయినా తేలిగ్గా అర్థమవుతుంది'' అంటూ బతిమలాడేవాడు.

కిరీటి, తాను ఏ కాలవఒడ్డునో, రైలు పట్టాల దగ్గరో హాయిగా తిరుగుతూ గడపాలనుకునే సాయంత్రాలు, ప్రభాకర్ దగ్గర కూర్చుని అతనికి పాఠాలు చెబుతూ గడిపేవాడు.

కిరీటి మెప్పు పొందాలని, ప్రభాకర్ అతన్ని తరచూ సినిమాలకీ, హోటళ్ళకీ తీసుకెదుతూ వుండేవాడు. అంతేకాదు కిరీటికి విసుగు పుట్టే వరకూ కిరీటి తెలివితేటల్ని పొగుడుతూ వుండేవాడు. కండలు తిరిగిన అతని శరీరాన్ని మెచ్చుకుంటూ వుండేవాడు.

ఒకసారి, కిరీటి క్లాస్‌మేట్ సుధ, కిరీటికి ప్రేమలేఖ రాసింది. అది చూసి శశాంక వేళాకోళంగా ఏదో అనబోయాడు. అప్పుడు ప్రభాకర్ కిరీటిని వెనకేసుకొచ్చి శశాంకతో పోట్లాడాడు.

కిరీటికి ఆ నాటి సంఘటనలన్నీ జ్ఞాపకం వొచ్చి 'తన మీద అంత ప్రేమాభిమానం చూపిన ప్రభాకర్ తను 'దేహి' అని యాచిస్తే కాదనడు. తనకేదో దారి చూపిస్తాడు' అని అనుకున్నాడు.

ఆ ఆశతోనే, ఆ మర్నాడు ప్రభాకర్ దగ్గరకెళ్ళాడు కిరీటి.

ప్రభాకర్ అతన్ని చూసి చిన్నగా నవ్వి కూర్చోమని కూర్చీ చూపించాడు. ఆ మర్యాదకి కిరీటి తబ్బిబ్బు పడ్డాడు.

''ఊరకరారు మహానుభావులు. తమ రాకలోని ఆంతర్యమేమిటో?'' అనడిగాడు ప్రభాకర్.

అది వ్యంగ్యమని అనుకోలేదు కిరీటి. స్నేహితుడు కదా పరిహాసమాడుతున్నాడనుకొన్నాడు.

చిన్నగా నవ్వి- ''అవున్రా. కొద్దిగా పనుండే వొచ్చాను'' అన్నాడు కిరీటి.

ప్రభాకర్ ముఖం ముడుచుకు పోయింది. అప్పుడు దానికి కారణం తెలియలేదు కానీ ఆ తర్వాత తెలిసింది కిరీటికి. తను 'ఏరా' అని సంబోధించినందుకని!

''ఏమిటా పని?'' అన్నాడు ప్రభాకర్ పొడిగా.

''మరేం లేదురా. మా ఇంటి విషయం నీకూ తెలుసుగా. నేను డిగ్రీ పుచ్చుకుని నాలుగేళ్ళపైన అయింది. ఇప్పుడు నాకు గనుక ఉద్యోగం రాకపోతే ఇంట్లో అందరూ ఇంత విషం పుచ్చుకుని చావడం తప్ప గత్యంతరం లేదురా'' చివరి మాట అంటుంటే కిరీటి గొంతు పూడుకుపోయింది.

''అయితే నేనేం చెయ్యను?'' ఆ మాట ప్రభాకర్ విసుగ్గా అన్నా, కిరీటి తనున్న పరిస్థితుల్లో దాన్ని పట్టించుకోలేదు.

ప్రభా! మీ కంపెనీలో ఎంత చిన్న వుద్యోగమైనా సరే చూసి పెట్టరా'' దీనంగా ప్రార్థించాడు.

ప్రభాకర్ రివాల్వింగ్ చెయిర్లో వెనక్కి వాలి విలాసంగా కూర్చున్నాడు.

''మా కంపెనీలో కొన్ని పోస్టులున్నాయి......'' అర్థోక్తిలో ఆగిపోయాడు ప్రభాకర్.

ఆ మాటలకే తనకు ఉద్యోగం వచ్చినట్టుగా పొంగిపోయాడు కిరీటి.

''ప్రభా! వాటిలో ఏ ఒక్క ఉద్యోగమైనా నాకు వొచ్చేట్టు చూడరా'' కిరీటి బతిమిలాడాడు.

ప్రభాకర్ టేబుల్ మీద నున్న పేపర్ వెయిట్ చేతిలోకి తీసుకుని, దాన్ని అటూ ఇటూ తిప్పుతూ-

''ఆ వుద్యోగాలకి నీ క్వాలిఫికేషన్ పనికి రాదు'' అన్నాడు.

''అంటే ఎమ్.ఎ. పాసయిన వాళ్ళు కావాలా?''


''కాదు డిగ్రీ పాసయితే చాలు''

ప్రభాకర్ అంటున్న దేమిటో కిరీటికి అర్థం కాలేదు. అదే అడిగాడు.

''ప్రభా! నీ అభిప్రాయం ఏమిటో తెలీడం లేదురా''

''ఏం వుంది తేలీడానికి. ఆ వుద్యోగాలకి బి.ఎ. పాసయి వుంటే చాలు. కానీ, నువ్వు చూడబోతే ఫస్ట్ క్లాస్ స్టూడెంటువి. అంతేకాదు, గేమ్స్ ఛాంపియన్‌వి. అంతటి తెలివితేటలు, క్వాలిఫికేషన్లు మాకు అక్కర్లేదు''

క్షణం సేపు అతను అంటున్నదేమిటో కిరీటికి తెలియలేదు. ప్రభాకర్ వేపు



పద్మాలయ పబ్లికేషన్స్
నవలానవమోహిని సస్పెన్స్ థ్రిల్లర్
పోటీలో రు॥3000/- బహుమతి
పొందిన నవల

శశాంక నిమీలితల మధ్య
ప్రణయం పల్లవిస్తుందా?
గోవర్ధనరావు, నిమీలిత ప్రేమ
పంజరాన్ని భగ్నం చేస్తాడా?
అవధూతేంద్ర స్వామి ఎవరు?
కుండలినీ స్వామి ఆటలు
సాగుతాయా?

దేశద్రోహుల ముఠా
ఆట కట్టించేదెలా?
దేశమును ప్రేమించుమన్నా
అన్న గురజాడ సూక్తికి
అద్దం పట్టిన
ఆనందాశ్చర్యాల అద్భుత నవల-

ప్రఖ్యాత నవలారచయిత
డా॥ కొత్త రవీంద్రబాబు
అమృతకలశం
త్వరలో ప్రారంభం!
nani

## నీలి మేఘం

వెర్రిగా చూశాడు.

"అవున్రా కిరీటి! మాకు మామూలు తెలివి తేటలున్న వాడైతే చాలు. నీలాటి వాడైతే మేం తట్టుకోలేం. ఐనా, ఈ వుద్యోగాలు నీలాటి వాడికి తగినవీ కావు. నువ్వెక్కడ. మేమెక్కడ? మాలాటి వాళ్ళ మధ్య పని చేస్తే నీకు చాలా అవమానంరా. నీకేం తక్కువ? నీ ఫస్ట్‌క్లాస్ డిగ్రీ, నీ గేవ్స్ సర్టిఫికెట్లు చూసి పెద్ద వుద్యోగం నిన్ను వెతుక్కుంటూ వస్తుంది. నువ్వు చాలా గొప్పవాడి వవుతావురా"

ప్రభాకర్ మాటల వెనకమున్న వ్యంగ్యాన్ని అర్థం చేసుకున్నాడు కిరీటి.

తననీ, తన తెలివి తేటల్ని ఎత్తి పొడుస్తున్నాడు!

కాలేజీలో చదివే రోజుల్లో తను వాడికి పాఠం చెప్తూ- "ఇది కూడా అర్థం కాలేదా? నీ దింత మట్టి బుర్ర అనుకోలేదురా" అని అనేవాడు.

దాన్ని గుర్తు పెట్టుకుని తనని దెప్పిపొడుస్తున్నాడా? లేక, తన తెలివి తేటల్ని చూసి ఈర్ష్య పడుతున్నాడా?

ఏదైతే ఏం?

తనకి వుద్యోగం రాదు!

క్షణకాలం నిప్పుల మీద వున్నట్టు బాధపడ్డాడు కిరీటి.

"కిరీటీ! విష్ యూ బెస్ట్ ఆఫ్ లక్. నువ్వు గొప్పవాడివైన నాడు ఈ ప్రభాకర్‌ని గుర్తుంచుకోరా" అన్నాడు ప్రభాకర్ నవ్వుతూ.

ఆ నవ్వులోని హేళన కిరీటి మనస్సుని భగభగమండించింది. అక్కడ వుండలేక పోయాడు. చటుక్కున లేచి బయటకొచ్చేశాడు.

అయితే, ఆ తర్వాత మళ్ళీ ప్రభాకర్‌ని చూడలేదు!

** ** ** **

"కిరీటి! కాస్సేపు పడుకుంటావా?" శశాంక అడిగాడు.

కిరీటి ఆ మాటల్ని వినిపించుకోలేదు.

అతని మనసు ప్రభాకర్ గురించే ఆలోచిస్తోంది.

మళ్ళీ ఇన్నాళ్ళ తర్వాత ప్రభాకర్‌ని చూడబోతున్నాడు.

ప్రభాకర్ తనని చూసి ఏమంటాడు? శశాంకలా తనని నెత్తిన పెట్టుకుని పూజిస్తాడా? లేక, కపటమైన ఆత్మీయత, ప్రేమా చూపిస్తాడా? "చూశావా" నేను చెప్పినట్టుగానే నువ్వు గొప్పవాడి వయ్యావు" అంటూ అసూయ పడ్తాడా?

ఈ ఆలోచనలతో కిరీటి నవ్వుకున్నాడు.

"ఏమిటి కిరీటి! నీలో నువ్వే నవ్వుకుంటున్నావు?" శశాంక అడిగాడు.

కిరీటి ఏదో సమాధానం చెప్పబోయాడు.

ఇంతలో కాలింగ్ బెల్ మ్రోగింది.

శశాంక లేచి వెళ్ళి తలుపు తీశాడు.

"రా ప్రభా?"

"ఎందుకురా అర్జెంటుగా రమ్మన్నావ్? ఏమిటి విశేషం?" ప్రభాకర్ అడిగాడు.

"గొప్ప విశేషమే. అక్కడ కూర్చున్న దెవరో చూడు"

ప్రభాకర్ చూశాడు.

కిరీటి ప్రక్క భాగం మాత్రం కనిపిస్తోంది ప్రభాకర్‌కి. అతని చేతికున్న బంగారు కడియం, దానిలో పొదగబడ్డ వజ్రాలు తళుక్కుమన్నాయి.

ప్రభాకర్ ఆశ్చర్యంగా చూశాడు.


"గుర్తు పట్టలేదా ప్రభా?" శశాంక అడిగాడు.

"ఎవరు?"

"మన కిరీటిరా!"

ప్రభాకర్ తెల్లబోయి- "కిరీటా?" అన్నాడు.

"అవున్రా! వాడిప్పుడు మన కంటే పెద్ద బిజినెస్ మాన్ అయ్యాడు"




## నీలి మేఘం

ఇతడు కిరీటా? కళ్ళల్లో ఆ మెరుపు, ముఖంలో ఆ వెలుగూ ఈ కిరీటికి ఎలా వచ్చాయి? తనకు గుర్తున్న కిరీటి కళ్ళల్లో దైన్యం, ముఖంలో విచారం గూడు కట్టుకుని వుండేది. కానీ, ఈ కిరీటి అంతఃపురాల్లో అపురూపంగా పెరిగిన చక్రవర్తి కుమారుడిలా వున్నాడు!

"ప్రభా కిరీటి ఇప్పుడు కోట్ల మీద వ్యాపారం చేస్తున్నాడు తెలుసా" అన్నాడు శశాంక.

ప్రభాకర్ షాక్ వెంట షాక్‌ని తట్టుకోలేక పోతున్నాడు. కిరీటికి ఎదురుగా వున్న సోఫాలో కూర్చుండిపోయి-

శశాంకా! మంచి నీళ్ళురా  అన్నాడు.

శశాంక లేచి వెళ్ళి ఐస్ వాటర్ తీసుకొచ్చి యిచ్చాడు. ప్రభాకర్ ఐస్ వాటర్ తాగి స్థిమితపడ్డాడు.

కిరీటి, ప్రభాకర్ వైపు చూశాడు.

అతను ఇదివరకటి కంటే బాగా లావయ్యాడు. బట్టతల కూడా వచ్చింది.

"కిరీటీ! నువ్వింత వాడివి అవుతావని ఎప్పుడు అనుకోలేదు. నిన్ను చూస్తుంటే మా కెంత ఆనందంగా వుందో తెలుసా?' శశాంక అన్నాడు.

'అది ఆనందమా? అసూయా!' అనుకున్నాడు కిరీటి.

కిరీటి రెండు కాళ్ళూ టేబుల్ మీద పెట్టి వెనక్కి వాలి కూర్చున్నాడు.

శశాంక, ప్రభాకర్‌తో కిరీటి చేసే బిజినెస్ గురించి చెబుతున్నాడు.

"కిరీటి! నిన్నో విషయం అడగనా?" అన్నాడు శశాంక.

"అడుగు"

"నువ్వు హైద్రాబాద్ మమ్మల్ని చూడాలని వచ్చావా? ఇంకేదైనా పని మీద వచ్చావా?"

అతని ప్రశ్నకు కిరీటి నవ్వాడు.

(ఇంకావుంది)

